01ATP27F.qxd:01ATP27F.qxd 28/06/26 11:22 PM Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 28 జూన్ 2026 పేజీలు : 04


# ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

- పెద్దారెడ్డి నేర చరిత్రకు లెక్కేలేదు - టిడిపి కార్యకర్తలపై దాడులు జరిగితే ఊరుకోం - వైసిపి నేతలకు జెసి హాట్ కౌంటర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్ రెడ్డి

**అనంతపురం క్రైమ్ జూన్ 27 ప్రభాతవార్త**

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు వైసిపి నాయకులకు లేదని టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం అనంతపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మీడియా ముందు మాట్లాడారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి నేరచరిత్రకు లెక్కే లేదన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించమన్నారు. వైసిపి పార్టీ నేతలపై ఆయన విరుచుకుపడ్డారు. నిన్నటి పరిణామాలపై టీడీపీ సీనియర్ నేత, అనంతపురం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గత వైసీపీ పాలనలో తాడిపత్రిలో ప్రతిపక్షాలు అడుగు బయటపెట్టలేని పరిస్థితి ఉండేదని, అప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడని వారు ఇప్పుడు నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి హయాంలో తాడిపత్రి వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, ఇప్పుడు వారు చేస్తున్న ధర్నాలు కేవలం రాజకీయ నాటకాలని విమర్శించారు. ఎస్పీ కార్యాలయం ముందు మూడు గంటల పాటు వైసీపీ నేతలు నిరసన చేసినా ప్రభుత్వం అడ్డుకోలేదని, కానీ తమ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం లేదని ఆరోపించడం వారి ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోందని జేసీ మండిపడ్డారు. గంజాయి సంస్కృతిపై సంచలన ఆరోపణలు కేతిరెడ్డి పెద్దారెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేసిన జేసీ, తాడిపత్రిలో గంజాయి సంస్కృతికి వైసీపీయే కారణమని సంచలన ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని, మంగళవారం కోర్టు ముందు వాటిని సమర్పిస్తానని ఆయన ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా తమపై పెట్టిన 180 కేసుల విషయంలో న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. లీగల్ సెల్‌కు అన్ని వివరాలు అందజేస్తానని స్పష్టం చేశారు. టీడీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అధిష్టానంతో చర్చించి రాయలసీమ వ్యాప్తంగా భారీ కార్యకర్తల సభను నిర్వహిస్తానని సవాల్ విసిరారు. తాడిపత్రి రాజకీయాలు ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి వ్యక్తిగత విమర్శల స్థాయికి చేరడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు వైసీపీ నేతలకు లేదంటూ మండిపడ్డారు. ప్రజాస్వామ్యం ఎక్కడుంది? ఎస్పీ కార్యాలయం ముందు వైసీపీ నేతలు మూడు గంటల పాటు ధర్నా చేయగలిగారంటే, అది రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం ఉండటం వల్లే సాధ్యమైందని జేసీ ప్రభాకర్ రెడ్డి గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులు లేవని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఖిగతంలో టీడీపీ మహిళా కార్యకర్తలపై అన్యాయంగా 307 కేసులు పెట్టడం ప్రజాస్వామ్యమా? మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఏకంగా నా ఇంట్లోకి చొరబడటం ప్రజాస్వామ్యమా? ఇప్పటికీ ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తామనడం ఏ రకమైన ప్రజాస్వామ్యం?ఖి అని ఆయన నిలదీశారు. పెద్దారెడ్డి నేర చరిత్రకు లెక్కే లేదని జేసీ ఆరోపించారు. అవినీతి, అరాచకాలపై ఫైర్ వైసీపీ ఐదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి ఏంటని జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో గంజాయి సాగు, సరఫరా వెనుక పూర్తిగా వైసీపీ నేతల హస్తమే ఉందన్నారు. యల్లనూరు మండలం కొడవండ్లపల్లిలో ఏకంగా దేవాలయ హుండీ డబ్బులను కూడా వైసీపీ నేతలు సొంతానికి వాడుకున్నారని, దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందని ఆయన వెల్లడించారు. అంతేకాదు, గత చరిత్రను గుర్తు చేస్తూ.. అనంత వెంకట్రామిరెడ్డి తండ్రిని కొట్టించింది కేతిరెడ్డి ఫ్యామిలీ కాదా? అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటాం.. తమ్ముళ్లూ మేల్కొనండి! చంద్రబాబు నాయుడు, లోకేష్‌ల గురించి వైసీపీ నేతలు పిచ్చిపిచ్చిగా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని జేసీ హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడిన ఆ 24 మంది వైసీపీ నాయకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఖితెలుగుదేశం కార్యకర్తలకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటాం. కార్యకర్తలపై దాడులు జరిగితే ఊరుకోం. కానీ, టీడీపీ కార్యకర్తలంతా ఇప్పటికైనా మేల్కోవాలి. సరిగ్గా మూడేళ్ల తర్వాత మళ్లీ వైసీపీ వాళ్లు కొట్టే పరిస్థితి రావచ్చు, కాబట్టి అలసత్వం వద్దుఖి అని పిలుపునిచ్చారు. చంద్రబాబు, లోకేష్ అనుమతితోనే ఈ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

# జిల్లాలో 95.42 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశాం

- 19,45,108 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేత - మధ్యాహ్నం వరకు 1,89,948 మంది ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి తీసుకున్నాం
- దివారం డిఆర్డిఏ, మెప్మా సిబ్బంది ద్వారా ప్రతి ఇంటింటికీ వెళ్లి ఎస్.ఐ.ఆర్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అవగాహన కల్పించేందుకు చర్యలు - ప్రెస్ మీట్‌లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, జూన్ 27 ప్రభాతవార్త బ్యూరో**

జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా ఇప్పటివరకు 95.42 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై డిఆర్ఓ ఏ.మలోలతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో భాగంగా 15.06.2026 నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం జరుగుతోందని, జిల్లాలో 2,226 పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 20,38,527 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 19,45,108 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందని, శనివారం మధ్యాహ్నం వరకు 1,89,948 మంది ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి తీసుకున్నామని, 9.32 శాతం ఎలిమినేషన్ ఫారాలు డిజిటైజ్డ్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ప్రారంభమై దాదాపు 12 రోజులు అవుతోందని, ఈ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ చట్టబద్ధంగా ప్రారంభం కావడానికి ముందే, పాత 2002 ఎలక్టోరల్ రోల్స్‌కు సంబంధించి పనులను వేగవంతం చేయడం కోసం ఒక మ్యాపింగ్ ఎక్సర్‌సైజ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉన్న ఓటర్ల అందరి ఇంటింటికి వెళ్లడం, ప్రతి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నామని, పూరించిన ఫారాలను తిరిగి సేకరించి వాటిని డిజిటలైజ్ చేయడం జరుగుతోందని, ఈ ప్రక్రియ ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతోందన్నారు. బి.ఎల్.ఓల ద్వారా ఈ సేకరణ ప్రక్రియ విజయవంతంగా సాగుతోందని, ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీలో జిల్లా యావరేజ్ (సగటు) 95 శాతంతో చాలా బాగున్నప్పటికీ, కొన్ని పోలింగ్ స్టేషన్లలో మాత్రం ఇంకా వెనుకబడి ఉన్నామని, 20 శాతం 40 శాతం మధ్య నమోదు ఉన్న పోలింగ్ స్టేషన్లు దాదాపు 9 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 40 శాతం 60 శాతం మధ్య నమోదు ఉన్నవి 13 పోలింగ్ స్టేషన్లు ఉన్నయని, 60 శాతం 80 శాతం మధ్య నమోదు ఉన్నవి 59 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, 80 శాతం 90 శాతం మధ్య నమోదు ఉన్న పోలింగ్ స్టేషన్లు 268 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రధానంగా అర్బన్, సెమీఅర్బన్ (పట్టణానికి ఆనుకుని ఉన్న) ప్రాంతాలలోనే వెనుకబడి ఉన్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఒకరిని అడిగితే మరొకరి వివరాలు, వారు ఎక్కడికి వెళ్లారు అనేది సులభంగా తెలిసిపోతుందని, కానీ పట్టణ ప్రాంతాలలో గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వలసలు, సొంత ఇల్లు సెమీ అర్బన్ లో ఉండి, ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాల్లో ఉంటూ ఓటు ఇక్కడే ఉంచుకోవాలనుకోవడం, అద్దె ఇళ్లు తరచూ మారడం వంటి కారణాల వల్ల ఓటర్లను గుర్తించడం కష్టంగా మారిందన్నారు. పోలింగ్ స్టేషన్ల జాబితాను ఇప్పటికే మెప్మా మరియు డి.ఆర్.డి.ఏ సిబ్బందికి అందించడం జరిగిందని, సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడి, వీలైనంత వరకు ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకునేలా చూడాలని, తీసుకున్న ఫామ్‌లను రాబోయే 45 రోజుల్లో పూర్తి చేసి తిరిగి ఇవ్వాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడానికి జూలై 14 వరకు సమయం ఉన్నప్పటికీ, చివరి నిమిషంలో సర్వర్లపై ఒత్తిడి పడకుండా ఉండటానికి, ఫామ్ అందిన 34 రోజుల్లోనే పూర్తి చేసి తిరిగి ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 95 శాతం మంది ఈ ఫామ్‌లను తీసుకున్నారని, ఫామ్‌లో కేవలం నిజమైన వివరాలు మాత్రమే రాయాలని, కింద ఇచ్చే డిక్లరేషన్‌లో "పైన పేర్కొన్న వివరాలన్నీ నిజమైనవి" అని సంతకం చేయాల్సి ఉంటుందని, ఎవరూ కూడా రెండు లేదా మూడు చోట్ల ఓట్లు పొందడానికి ప్రయత్నించకూడదన్నారు. ఒకే వ్యక్తి రెండు లేదా మూడు ఓట్లు పొందేలా డిక్లరేషన్ ఇచ్చి, ఎన్యుమరేషన్ ఫారాలు సేకరిస్తే అది ఎన్నికల నిబంధనల ఉల్లంఘన అవుతుందని, అలా చేస్తే క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. చట్టప్రకారం మరియు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఈ ఫారాలను సేకరించే పూర్తి బాధ్యత కేవలం బి.ఎల్.ఓలదేనన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన బి.ఎల్.ఏలు రోజుకు 50 ఫారాల వరకు సేకరించి బి.ఎల్.ఓలకు ఇవ్వవచ్చని, అయితే, ఆ ఫారాలను కేవలం బి.ఎల్.ఓలకే అందజేయాలన్నారు. హెల్ప్ డెస్క్‌ల ద్వారా ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకోవడం, వాటిని పూర్తి చేసి తిరిగి ఇవ్వడంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్

**గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం :**

అంతకుముందు శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసాం, ఎన్ని తిరిగి తీసుకున్నాం, అన్ని వివరాలు తెలియజేసారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు బిఎల్ఏలను ఎక్కువ మందిని నియమించాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కార్యాచరణతో డ్రగ్స్ నివారించండి

- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ సాయి



హాజరైన సంబంధిత శాఖల అధికారులు

**శ్రీ సత్య సాయి జిల్లా, జూన్ 27, ప్రభాతవార్త ప్రతినిధి**

శ్రీ సత్యసాయి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్తో పాటు జిల్లా ఎస్.పి సతీష్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొని, జిల్లాలో నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణా, విక్రయాల అరి కట్టడానికి తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును రూపుమాపుతున్న మత్తు సంస్కృతిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. కేవలం సంప్రదాయ తనిఖీలకే పరిమితం కాకుండా, ప్రస్తుత కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నిఘా వ్యవస్థలో భాగం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గంజాయి, ఎన్ డి పి ఎస్ డ్రగ్స్ యొక్క మూలాలను, వాటి సరఫరా గొలుసును సాంకేతిక ఆధారాలతో గుర్తించి పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు. గతంలో జిల్లాలో నమోదైన గంజాయి మరియు డ్రగ్స్ కేసుల్లోని నిందితులు, రవాణాదారులు మరియు మధ్యవర్తుల ప్రస్తుత కదలికలపై పోలీసు, ఎక్సైజ్ శాఖలు నిరంతరం నిఘా ఉంచాలనీ, వారు మళ్లీ పాత నేరాల బాట పట్టకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని, యువత , విద్యార్థులు ఈ రొంపిలో పడకుండా విద్యాశాఖ సహకారంతో అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్, గోవింద నాయక్ డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్, నరసింహులు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ , ఎన్. సి ఓ ఆర్ డి కమిటీ సభ్యులు, జిల్లాలోని వివిధ సబ్‌డివిజన్ల పోలీస్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# చుక్కలూరు హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డి





మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డి, పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎంఎల్‌సి

**తాడిపత్రిఅర్బన్, జూన్ 27 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఎల్‌సి రాంగోపాల్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతున్న తీరును, ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు.

అనంతరం విద్యార్థులతో కలిసి, వారికి ప్రతిరోజు అందుతున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వస్తున్నదా లేదా, నాణ్యత ఎలా ఉందనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. భోజనం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆయన అధికారులకు సూచించారు.

# భక్తిశ్రద్ధలతో పీర్ల దేవుళ్లకు పానకాల సమర్పణ

- పీర్ల చావడుల్లో ప్రత్యేక అలంకరణలు - భారీగా తరలివచ్చిన భక్తజనం
- అగ్నిగుండాల ప్రదక్షిణలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు - తులాభారాలు, పానకాల సమర్పణతో విశేష భక్తి ప్రదర్శన





పీర్ల దేవుళ్లను దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు, పీర్లకు సమర్పించేందుకు పానకాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

**కళ్యాణదుర్గం, జూన్ 27 ప్రభాతవార్త**

మత సామరస్యానికి ప్రతీకగా, భక్తి, విశ్వాసాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే పీర్ల పండుగ సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలోని పీర్ల చావడులు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. పీర్ల దేవుళ్లను వెండి ఆభరణాలు, పట్టువస్త్రాలు, పూలతో సుందరంగా అలంకరించగా, ఆ దివ్య దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పీర్ల పండుగలో అత్యంత విశిష్టమైన ఆచారంగా భావించే పానకాల సమర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకునే భక్తులు నియమనిష్ఠలతో పవిత్రంగా పానకాలను ఊరేగింపుగా తీసుకువచ్చి పీర్ల దేవుళ్లకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని వేడుకున్నారు. పీర్ల చావడుల వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొక్కుబడులు ఉన్నవారు తులాభారాలు సమర్పించి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పీర్ల దేవుళ్లను దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. పీర్ల పండుగ విశిష్టత: పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఆధ్యాత్మిక ఉత్సవం. హిందూ, ముస్లిం మతాలకు చెందిన ప్రజలు భేదాభిప్రాయాలు లేకుండా ఈ వేడుకల్లో పాల్గొని పీర్ల దేవుళ్లను దర్శించుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. పానకాల సమర్పణ, అగ్నిగుండాల ప్రదక్షిణ, తులాభారాలు వంటి సంప్రదాయ ఆచారాలు భక్తుల విశ్వాసానికి ప్రతీకలుగా తరతరాలుగా కొనసాగుతున్నాయి. ఈ పండుగ సమాజంలో ఐకమత్యం, సోదరభావం,



పీర్ల దేవుళ్ల మందిరం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం

# ప్లాన్ ప్రకారమే పెద్దారెడ్డి మా ఇంటికి వచ్చారు

- మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని కొడితే తెలుస్తుంది నా బాధ
- మాజీ ఎంపి తలారి రంగయ్య మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిపై జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫైర్

**తాడిపత్రిఅర్బన్, జూన్ 27 ప్రభాతవార్త**

ప్లాన్ ప్రకారమే మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తన ఇంటికి వచ్చి తనవారిని దూషించాడని పెద్దారెడ్డిని సపోర్ట్ చేస్తూ మాట్లాడుతున్న మాజీ ఎంపి తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిపై టిడిపి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. మీ ఇంటికి వచ్చి మీవారిని చితకబాదితే నా బాధ ఏంటో మీకు తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను, తన కుమారుడు జె.సి అశ్మిత్‌రెడ్డి ఇంట్లో లేని సమయంలో పెద్దారెడ్డి నాలుగు వాహనాల్లో తన ఇంటి వద్దకు వచ్చి కర్రలు రాళ్లు తీసుకుని తన ఇంటిలో ఉన్న అనుచరులను చితకబాది తన భార్యతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం జరిగిందన్నారు. ఆ సమయంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని భయభ్రాంతులకు గురి చేయడానికి ఇలా చేశారన్నారు. పెద్దారెడ్డి (స్పాంటినెన్స్) అనుకోకుండా తన ఇంటికి వచ్చారని ఇంగ్లీషులో మాట్లాడుతూ దానికి అర్థం కూడా తెలియకుండా మాట్లాడడం విడ్డూరమన్నారు. ఆ సంఘటన జరగకముందు ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోలేదని వాంటెడ్ గానే తమపై దాడి చేయడానికి పెద్దారెడ్డి నాలుగు వాహనాల్లో తమ ఇంటిలోకి చొరబడ్డారని తెలియకపోతే వీడియోలు పంపిస్తానని చూసి మాట్లాడాలని జె.సి హితవు పలికారు.


రైల్వే వంతెనలు, అండర్ బ్రిడ్జిల పనులను వేగవంతం పూర్తి చేయాలి

అక్రమ రిజిస్ట్రేషన్ లపై చట్టరీత్యా చర్యలు తప్పవు - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

4పంచాయతీల్లో తాగునీరు, డ్రైనేజీల సమస్య లేకుండా చూడండి 4>>


# ఎట్టకేలకు రెగ్యులర్ డీడీ నియామకం

**అనంతపురం న్యూటౌన్,జూన్ 27 ప్రభాతవార్త**

సోషల్ వెల్ఫేర్ కు రెగ్యులర్ డీడీ లేకపోవడం వల్ల ఇతర అధికారులకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడం వలన సరిగ్గా పర్యవేక్షణ లేకపోవడంతో పదో తరగతి ,ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫలితాల ఉత్తీర్ణత శాతం తగ్గింది. అదేవిధంగా ఇన్ ఛార్జ్ ల పాలన వలన సరిగ్గా హాస్టల్స్ పర్యవేక్షణ లేకపోవడం, గ్రేడ్ వన్ పదోన్నతులు, తదితర అంశాలపై తాజాగా వార్త దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందుకు ప్రభుత్వం స్పందించింది. సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులుగా పనిచేస్తున్న నలుగురికి డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించింది. అందులో పల్నాడు జిల్లాలో పనిచేస్తూ డీడీ గా పదోన్నత పై అనంతపురం జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వము మూడు రోజుల క్రితం జీవోను విడుదల చేసింది. నూతన డీడీ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

**ఇద్దరికీ ఏఎస్ డబ్ల్యుఓగా పదోన్నతులు :**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుక్కరాయసముద్రం ఎస్సీ హాస్టల్ హాస్టల్ వార్డెన్ గా పనిచేస్తున్న రామునాయక్ , మరొక వార్డెన్ వేణుగోపాల్ లకు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ డైరెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీగా ఉన్న అనంతపురం డివిజన్ కు రాము నాయక్, పుట్టపర్తి డివిజన్ కు వేణుగోపాల్ ను నియమించారు. ఆ ఇద్దరు అధికారులు తమ పాత స్థానాల్లో రిలీవ్ అయ్యి కొత్త స్థానాల్లో జాయిన్ అయ్యారు.

**వార్త ప్రభావం**

**పలువురికి గ్రేడ్ వన్ పదోన్నతులు**

సోషల్ వెల్ఫేర్ లో పలు కారణాల వలన గత కొన్ని కారణాల వలన గ్రేడ్ వన్ పదోన్నతులు ఆగిపోయాయి. ఒక వార్డెన్ కోర్టుకు వెళ్లడంతో కొన్ని సంవత్సరాలు తర్వాత ఆయన మంచి మనసుతో కేసు వెనక్కి తీసుకున్నారు. మరొక మహిళా వార్డెన్ కూడా తాజాగా కోర్టుకు వెళ్ళింది. జిల్లా యంత్రాంగం ప్రభుత్వ అడ్వకేట్ ద్వారా లీగల్ ఒపీయన్ తీసుకొని గత నెలలో ఏడుగురికి గ్రేడ్ వన్ పదోన్నతులు కల్పించడం జరిగింది. అందులో ఓబులమ్మ, సునీత, రవీంద్రనాథ్ రెడ్డి, వీరనారప్ప, ఫమీద, శ్రీవాణి, సువర్ణ, జగన్నాథం ఉన్నారు. తాజాగా ఇద్దరు గ్రేడ్ వన్ వార్డెన్లకు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా పదోన్నతులు రావడంతో తాజాగా కోర్టుకు వెళ్లిన మహిళా వార్డెన్ నాగలక్ష్మి, వాణి శైలజ లకు గ్రేడ్ వన్ పదోన్నతులు రానున్నాయి. ఇందుకు సంబంధించిన ఫైలను కూడా శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కు పంపించారు. ఈ పదోన్నతులు వలన వార్డెన్ల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలకు ఫుల్ స్టాప్ పడనుంది. ఇకపై ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, అనవసర ఆరోపణలు చేయడం, కోర్టుకు వెళ్లడం వంటివి లేకుండా కలిసిమెలిసి బాగా పనిచేస్తారని అధికారులు భావిస్తున్నారు.

## పోలియో రహిత సమాజం కోసం

# ప్రతి ఒక్కరూ పోలియో చుక్కలు వేయించుకోండి



కమిషనర్ జశ్వంతరావ్

**అనంతపురం జూన్ 27 ప్రభాతవార్త**

నగరంలోని చిన్నారులకు (0-5 సం॥ల వయస్సు) తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించుకొని పోలియో రహిత సమాజాన్ని సృష్టించుకుందామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జశ్వంత్‌రావ్ తల్లిదం డ్రులకు పిలుపునిచ్చారు. నేడు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా నగరంలో ఏర్పాట్లను పూర్తి చేశామని ఇంటింటికీ రావడంతో పాటు ప్రధాన కూడళ్లలో, బస్టాండు, రైల్వే స్టేషన్లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పంచముఖి ఆంజినేయ స్వామి వేడుకల్లో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు



గుండుమలను సన్మానిస్తున్న ఆలయ మండలి సభ్యులు

**అగళి, జూన్ 27 ప్రభాతవార్త**

రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బొమ్మానసనపల్లి గేట్ వద్ద నూతనంగా నిర్మించిన పంచ ముఖి ఆంజినేయస్వామి వేడుకల్లో పాల్గొన్నారు. నూతనంగా స్వామిని ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. అభిషేకాలు, హోమాలతో పంచముఖి ఆంజినేయస్వామి పూజలు నిర్వహించారు. ఈ నూతన దేవాలయ ప్రారంభానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. 41 రోజుల పూజల అనంతరం గనంగా శనివారం పూజలు నిర్వహించారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిక్కప్పయ్య, అన్నదమ్ములు కలిసి నూతన దేవాలయ నిర్మాణాన్ని చేపట్టారు. మహా మ ంగళహారతి, అభిషేకాల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ మండలి వారు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ తిప్పేస్వామి, జిల్లా తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్‌మూర్తి, నాయకులు హేమంత్, శ్రీరాములు, రమేష్, కృష్ణప్ప, రంగప్ప, అఖీమ్‌సాబ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## డ్రిప్ స్పింక్లర్లల కోసం రైతు సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోండి

**ఏపీఎంఐపి, ఎంఐఏఓ జి.ఎన్.నరసింహాప్ప**

**అమరాపురం జూన్ 27 ప్రభాతవార్త**



జి.ఎన్.నరసింహాప్ప

2026-27 వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏ.పీ.ఎం.ఐ.పీ. ద్వారా సబ్సిడీతో డ్రిప్ మరియు స్ప్రింక్లర్స్ కావలసిన రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రాల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని మడకశిర డివిజన్ ఏపీఎంఐపి, ఎంఐఏఓ జి .ఎన్. నరసింహప్ప కోరారు. ముఖ్యంగా రైతులు తమకు కావాల్సిన కంపెనీతో పి.ఐ.ఆర్. చేయించుకుని మీకు నచ్చిన తర్వాత వెంటనే కేవలం ఫోన్ పే గూగుల్ పే, నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే డీ.డీ.లు చెల్లించాలని ఎవరికీ నగదు రూపంలో ఇవ్వకూడదని తెలియజేశారు.సబ్సిడీ వివరాలు ఆయన తెలియజేస్తూఎస్సీ,ఎస్టీ,రైతులకు పట్టాదారు పాసు పుస్తకం నందు 5 ఎకరములు ఉంటే 100శాతం సబ్సిడీ, 5 ఏకరములు పైన గల రైతులకు 90శాతం సబ్సిడీ ప్రకారముగా, మరియు ఇతర రైతులకు బి.సి, మరియు ఓ.సి క్యాటగిరి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకము నందు 10ఎకరముల వరకు 90శాతం సబ్సిడీ ప్రకారము, పది ఎకరములు పైబడిన అందరి రైతులకు 50శాతం సబ్సిడీతో డ్రిప్పు ఇరిగేషన్ పరికరాలు ఇవ్వబడు తుందని, అలాగే స్ప్రింక్లర్స్ అన్ని కులాల రైతులకు 50శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్స్ ఇవ్వబడతాయని తెలిపారు. 50శాతంసబ్సిడీతో, మన రైతులకు వరమైనటువంటి ఆటోమేషన్ అందజేస్తామని, ఇది కూడా ఆర్.ఎస్.కె.లలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఏం.ఐ.ఏ.ఓ జి ఎన్ నరసింహప్పను 7995010074 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

**వలస,వి.అగ్రహారంలో**

## రైతన్న మీ కోసం వారోత్సవాలు



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

**అమరాపురం జూన్ 27 ప్రభాతవార్త**

మండల పరిధిలోని వలస, వి.అగ్రహారం గ్రామాల్లో రైతన్న నీ కోసం వారోత్సవాలు శనివారం వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లోని రైతు కుటుంబాలను సందర్శించి ఖరీఫ్ సీజన్‌లో అమలు చేయనున్న పథకాలు, వ్యవసాయ సాంకేతికతలు మరియు పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించారు. రైతులకు ఏపీ ఏఐఎంఎస్ 2.0 ఫార్మర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానం, యాప్ ద్వారా ఎరువుల పంపిణీ ప్రక్రియ గురించి అధికారులు వివరించారు. అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయవద్దని, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరియు వర్షాల లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడిపై రైతులకు విలువైన సలహాలు అందించారు. ముఖ్యంగా వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజునాథ్, ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు, సింగిల్ విండో ప్రెసిడెంట్ గణేష్ , మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప , టి ఎన్ టి యు సి కార్యదర్శి అంజన్న అదేవిధంగా అగ్రహారం గ్రామం నందు మండల క్లస్టర్ కన్వీనర్ నవీన్, టిడిపి నాయకుడు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రిటైర్డ్ హెచ్ఎం ఎన్సీ నరసప్ప జ్ఞాపకార్థం సభా వేదిక ఏర్పాటు



సభ వేదిక ప్రారంభిస్తున్న దృశ్యం.

**కొత్తచెరువు జూన్ 27 ప్రభాత వార్త.**

శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రిటైర్డ్ హెచ్ఎం ఎన్సీ నరసప్ప జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సభా వేదికను 12 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించారు ఈ సభ వేదికను కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా నరసప్ప కొత్తచెరువు ఎస్ ఏ ఏ ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో సుదీర్ఘంగా 18 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా ప్రధానోపాధ్యాయులుగా పనిచేసే ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు వెళ్లడానికి దోహదపడ్డారు అప్పట్లో ఎంసీ నర్సప్ప విద్యార్థులకు క్రీడల్లోనూ విద్యాభ్యాసంలోనూ చక్కగా బోధించి మంచిక్రమశిక్షణతో విద్యాబుద్ధులు చెప్పే వారన్నారు ఆయన జ్ఞాపకార్థం సభా వేదిక ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పాఠశాల హెచ్ఎం గోపాల్ రిటైర్డ్ హెచ్ఎం వెంగ న్న పేర్కొన్నారు ప్రభా వేదిక ప్రారంభ అనంతరం కుటుంబ సభ్యులకి పూలమాలలు వేసే దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఈ పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు పివి సూర్యనారాయణ సి.నాగభూషణ సురేంద్ర బాబు , ఎంవి పాపన్న రిటైర్డ్ ఎమ్మార్వో రామాంజనేయులు బిల్ కలెక్టర్ నారాయణ సెరికల్చర్ డిపార్ట్మెంట్ వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమకు సంసిద్ధతను పెంపొందించిన... బెస్ట్ యూనివర్సిటీ



సమావేశం నిర్వహించిన దృశ్యం.

**గోరంట్ల జూన్ 27 ప్రభాత వార్త**

మారుతున్న కార్పొరేట్ ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయడం, వారి ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరచడం అనే లక్ష్యంతో, శ్రీ సత్యసాయి జిల్లాలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ, బెంగళూరుకు చెందిన ఎంపాక్ట్‌ఫుల్ మైండ్స్ సహకారంతో ఒక రోజు క్యాంపస్‌టుకార్పొరేట్ కనెక్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించింది.ఈ కార్యక్రమానికి ఎంపాక్ట్‌ఫుల్ మైండ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ వాసుదేవన్, కార్పొరేట్ ట్రైనర్ శ్రీమతి సమీక్ష నాయకత్వం వహించారు. వీరు కార్పొరేట్ అంచనాలు, కార్యాలయ వృత్తి నైపుణ్యం, కమ్యూనికేషన్, నాయకత్వం, సమస్య పరిష్కారం, ఇంటర్వ్యూ సంసిద్ధత, మరియు ప్రముఖ సంస్థలలో విజయవంతమైన ఉద్యోగాలు పొందడానికి అవసరమైన కీలక నైపుణ్యాలపై విపులమైన సెషన్‌లను అందించారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ రూప వాసుదేవన్, నాయకత్వ లక్షణాలు, వ్యవస్థాపక ఆలోచనా విధానం మరియు వినూత్న దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారా సంప్రదాయ వృత్తి ఆకాంక్షలకు అతీతంగా వెళ్లాలని విద్యార్థులను ప్రేరేపించారు. తన కీలకోపన్యాసంలో, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె. నాగజ్యోతి, జ్ఞానం, నైపుణ్యాలు మరియు వైఖరి అనేవి వృత్తిపరమైన విజయానికి మూడు మూలస్తంభాలని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా ఎంపాక్ట్‌ఫుల్ మైండ్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ వాసుదేవన్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం మరియు ఎంపాక్ట్‌ఫుల్ మైండ్స్ కలిసి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మరియు మిశ్రమ అభ్యాస పద్ధతుల ద్వారా ఒక నిర్మాణాత్మక శిక్షణా వ్యవస్థను అందించడానికి కృషి చేస్తాయని, ఇందులో ప్రత్యక్ష అనుభవపూర్వక అభ్యాసానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని ప్రకటించారు. .ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఛైర్మన్ భరత్ లాల్ మీనా, పరిశ్రమ విద్యాసంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేసే దిశగా ఎంపాక్ట్‌ఫుల్ మైండ్స్‌తో కలిసి పనిచేయడం ఒక ముఖ్యమైన ముందడుగు అని కొనియాడారు. కార్పొరేట్ ప్రపంచంలో రాణించడానికి అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలు, వృత్తిపరమైన వైఖరి, ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థులకు అందించి, వారిని పరిశ్రమకు సిద్ధంగా ఉన్న నిపుణులుగా తీర్చిదిద్దడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్సెస్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ మరియు స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ అప్లైడ్ టెక్నాలజీ కి చెందిన మూడవ మరియు చివరి సంవత్సరం విద్యార్థులు ఈ ఓరియెంటేషన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రదీప్ రాజు

**రామగిరి, జూన్ 27 ప్రభాతవార్త**

బాల్యవివాహాలను వద్దని, వాటిని పూర్తిగా నిర్మూలిద్దామని డాక్టర్ ప్రతాప్, ఎస్ఐ ప్రదీప్ రాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ లతాకిరణు అన్నారు. శనివారం రామగిరిలో బాల్యవివాహాల నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలు వద్దు ఆడపిల్లలను చదివిద్దాం, ఆరోగ్యం కాపాడుదాం తదితర నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..బాల్యవివాహాల వల్ల ఎంతో ప్రమాదం ఉందని, బాల్యంలోనే వివాహాలు చేయడం వల్ల పుట్టే బిడ్డలు కూడా బలహీనంగా ఉంటారన్నారు. పిల్లలపై లైంగిక నేరం క్షమించరానిదన్నారు. మహిళలకు సంబంధించిన చట్టాలు పోక్సో గురించి తెలియజేశారు. ఈ ర్యాలీలో ఆంగన్వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్స్ పోలీయోపై ర్యాలీ



పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**రామగిరి, జూన్ 27 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని శనివారం ర్యాలీ నిర్వహిం చారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, నిండు జీవితానికి రెండు చుక్కలు వేయాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామంటూ ర్యాలీ నిర్వహించారు. భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ ప్రతాప్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి**

## రూ.50.85 లక్షలు కేటాయింపు

**ధర్మవరంటౌన్ , జూన్ 27 ప్రభాతవార్త**



నూతనంగా నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

పట్టణంలోని సిద్దయ్య గుట్టలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు తిరుమలతిరుపతి దేవస్థానం బోర్డు శ్రీవాణి ట్రస్ట్ తీర్మానాల మేరకు రూ.50.85 లక్షలు నిదులు కేటాయించినట్టు ఆలయ అబివృద్ధికమిటి అధ్యక్షురాలు జయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధిపనులకు శ్రీవాణి ట్రస్ట్ నిదులకింద ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ...నిదులు వచ్చిన వెంటనే ఆలయ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామన్నారు.దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప మఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన జడ్పిటిసి

**అగళి, జూన్ 27 ప్రభాతవార్త**



భోజనాన్ని తనిఖీ చేస్తున్న జడ్పిటిసి

అగళి కెజిబివి పాఠశాలను జడ్పిటిసి ఉమేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు రోజూ పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఓ నాగరత్నకు, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వస్తువులతో నాణ్యమైన బోజనాన్ని, సాంబారును అందించాలని, క్రమం తప్పకుండా వారికి కోడిగుడ్లు అందివ్వాలని పాఠాలు బాగా బోధించాలని వారికి సూచించారు.

## తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి

**ధర్మవరం, జూన్ 27, ప్రభాతవార్త**



వీధి వ్యాపారులకు బ్యాంకుఖాతాల పాసుపుస్తకాలను అందజేస్తున్న కమిషనర్ వెంకటరమణయ్య

బ్యాంకులలో పీయంస్వానిది 20 కింద బ్యాం కులలో తీసుకున్న రుణాలను తీసుకోవడమే కాకుండా వాటిని సక్రమంగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య వీది వ్యాపారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం 87 మంది వీధి వ్యాపారులతో లోక్ కళ్యాణ్ మేళాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కమిషర్ పాటు మెప్మాటీపీఆర్ఓ విజయ్ బాస్కర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియామేనేజర్ రాజేష్ దొరయి. అసిస్టెంట్ మేనేజర్ బి.రెడ్డిసాగర్, సిటీమిషన్ మేనేజర్ లక్ష్మీనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీయంస్వానిది 2.0లోక్ కళ్యాణ్ మేళా పథకం ద్వారా వీధి విక్రయదారులు, చిన్నవ్యాపారాలు చేసుకునే వారికి పీయంస్వానిది లబ్దిదారులు, వారి కుటుంబ సభ్యుల సామాజిక ఆర్థిక ప్రొపైలింగ్స్ను నిర్వహించివారిని రూ.15వేల నుండి రూ.50వేల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ రుణాలను సకాలంలో చెల్లిస్తే 7శాతం వడ్డీరాయితీ వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని వీది వ్యాపారులు సద్వినియోగంచేసుకోవాలన్నారు.

**పాత పెన్షన్ విధానం అమలులోకి తెచ్చిన**

## సీఎంకి ప్రత్యేక కృతజ్ఞతలు

**సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన టీచర్లు**



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయులు దృశ్యం.

**కొత్తచెరువు జూన్ 27 ప్రభాతవార్త**

2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానంను అమలు లోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలియజేస్తూ టీచర్లు కృతజ్ఞతలు తెలుపుతూ పాలాభిషేకం నిర్వహించారు డీఎస్సీ 2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు సిపిఎస్ విధానం అమల్లో ఉండేది కేంద్ర ప్రభుత్వం మేము నెంబర్ 57 ప్రకారం ఫిబ్రవరి 19 2026 ఆధారంగా సెప్టెంబర్ 1 , 2004 ముందు విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానము అమలు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం ఈనెల 23వ తేదీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది అందుకు కృతజ్ఞతగా ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయులు కొత్తచెరువు ఎంఆర్సి కార్యాలయం ఆవరణంలో మరియు నెహ్రూ సర్కిల్ నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు చిత్రపటాలను ఉంచి పాలాభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం వల్ల 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓ పి ఎస్ పాత పెన్షన్ విధానం వర్తించనుంది సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంపై కృషిచేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి వివిధ ప్రజాప్రతినిధులకు ఉపాధ్యాయుల తరపున ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సత్కారం

**- ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2,500 నగదు అందజేత**



సత్కారం పొందిన విద్యార్థులతో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు

**లేపాక్షి, జూన్ 27 ప్రభాతవార్త**

లేపాక్షి మండల ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఐఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు పవన్, హారీష్‌కుమార్, నితిన్, నానిలను వీరభద్ర అన్న ప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి , ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అర్హులైన ఉపాధ్యాయుల బోధన వల్లనే విద్యార్థులకు ఉన్నతస్థాయి బోధన అందుతోందన్నారు. 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడమే కాక ఐఐటీలో సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు అధిరోహించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ రాబోయే కాలంలో మరికొంత మంది విద్యార్థులు ఐఐటీలో ప్రవేశం పొందే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులను వారు ఘనంగా సత్కరించారు. వీరభద్ర అన్న ప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థికి 2,500 రూపాయల నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంప్రసాద్, అంజనరెడ్డి, వీరన్న, మురళిరెడ్డి, ఉపాధ్యాయులు హితేంద్రనాథ్, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**వృద్ధాశ్రమంలో టిడిపి నాయకులు**

## వెంకటరమణస్వామి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**పెనుకొండ జూన్ 27 ప్రభాతవార్త**

పెనుకొండ నియోజకవర్గంలోనీ కొడిగనహల్లి పంచాయతీ పెద్దిరెడ్డిపల్లి కి చెందిన పరిగి మండల టిడిపి నాయకులు మాజీ ఎంపీటీసీ వెంకటరమణ స్వామి జన్మదినం శనివారం నిర్వహించారు. సేవామందిర్ లోని వృద్ధాశ్రమంలో ఉన్న 80 మంది వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో సోమప్ప అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.ఈ కార్యక్రమమునకు హాజరైన దాదాపు 200 మందికి సోమప్ప అన్నదానం చేశారు. ఈ సందర్భంగ మండల టిడిపి నాయకులు పూలమాలలు వేసి శాలవాలు కప్పి, పుష్పగుచ్చముల అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోవిందరెడ్డి,ఫైవ్ మెన్ కమిటి సభ్యులు సూర్యనారాయణ, మాజీ జెడ్పిటిసి బాలాజీ, సంజీవరాయప్ప,ప్రభాకర్, శ్రీనివాస్,మోహన్ కుమార్, నాగరాజు, నారాయణరెడ్డి, గోపాలరెడ్డి, అశ్వార్థనారాయణ, నాగప్ప, లక్ష్మీనారాయణ, హరి, రాజశేఖర్,మంజు,రాజు, నాగరాజు,సుబ్రహ్మణ్యం, మహిళలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి టీడీపీ కట్టుబడి ఉంది

**- ఎస్ఐఆర్‌పై అలసత్వం వద్దు.. అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదు పరిటాల శ్రీరామం**




ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్.

**ధర్మవరంటౌన్ , జూన్ 27 ప్రభాతవార్త**

ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు.ఫిర్యాదుదారులతో మాట్లాడిన పరిటాల శ్రీరామ్, ప్రజలు అందించే ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి పంపిస్తున్నామని, ప్రతి సమస్య పరిష్కారమయ్యే వరకు పార్టీ బాధ్యతగా వెంట ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజలకు న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.అనంతరం నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై సమీక్షించారు. బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ధర్మవరం నియోజకవర్గం ఓటరు మ్యాపింగ్ డిజిటలైజేషన్‌లో వెనుకబడి ఉందని పేర్కొన్న ఆయన, బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుని ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**పేరూరు డ్యామ్ కాలువకు భూమి కోల్పోయిన**

## రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

**రైతు సంఘం సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్.**



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్

**కనగానపల్లి జూన్ 27 ప్రభాతవా ర్త**

ఈనెల 30 తేదీన మంగళవారం నాడు రైతులు కౌలు రైతుల పరిష్కారానికై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడ ధర్నా చౌక్ లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో మునిగిపోయిందని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమినేతలు రంగురంగుల హామీలు వాగ్దానాలు గద్దెక్కిన తర్వాత అటకెక్కాయి క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు తీర్చడానికి ఎలాంటి చర్యలు తీసుకొని ప్రభుత్వం తాము పెద్ద ఎత్తున సంక్షేమం అందిస్తున్నామంటూ ప్రచారం మధ్యలో కోట్లాది రూపాయలతో ప్రచారాలు చేపట్టారు. పంటకు కనీస మద్దతు ధర దక్కడం లేదు సిండికేట్ మార్కెట్ మాయాజాలంలో చిక్కుకుని రైతులు నష్టపోతున్నారు. అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతం తెలంగాణ రాష్ట్ర మాదిరిగా మన రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి ఆత్మహత్యల నుండి రైతాంగాన్ని కాపాడుకోవాలి. ఇటీవల పెరిగిన ఎరువుల, పురుగుల మందు విత్తనాలు పెట్రోల్ డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాలు ధరలను తగ్గించాలని ఎన్నికల హామీ ప్రకారం కౌలు రైతులకు సులభతరంగా గుర్తింపు కార్డులు ( క్రాఫ్ట్ కల్టివేషన్ రైడ్స్ కార్డులు ) జారీ చేయాలని దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు 50 సంవత్సరాలు నిండిన వారికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో రైతు సంఘం జిల్లా కన్వీనర్ బి. లింగన్న, మండల కార్యదర్శి మెండెం బాలరాజు, రైతు సంఘం నాయకులు వడ్ల గోవిందు, పసల నాగరాజు, పెద్దన్న, గోపాల్, లింగమయ్య, నాగరాజు, రైతులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా బంజారా గుడి పూజారుల సదస్సు

**గుడి పూజారులకు గౌరవితనం ఇవ్వాలి**



అధ్యక్షులు రంగానాయక్ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


**కొత్తచెరువు జూన్ 27 ప్రభాతవార్త.**

శ్రీ సత్య సాయి జిల్లా లోని స్థానిక మామిళ్ల కంట క్రాస్ దగ్గర శీబి కన్వెన్షన్ హాలు లో బంజారా ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో బంజారా గుడి పూజారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సత్య సాయి జిల్లా తాండా ల నుండి బంజారా గిరిజన సుగాలి గుడి పూజారులు పాల్గొన్నారు ఈ సమావేశానికి బానోతు రంగా నాయక్ అధ్యక్షత వహించగా బంజారా ధర్మ రక్షా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ధాడి కృష్ణా నాయక్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు ఈ సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇమామ్‌లకు, చర్చి పాస్టర్లకు మరియు అర్చకులకు ప్రతినెల జీత భత్యాలు ఇచ్చినట్లే బంజారా సుగాలి గిరిజన గుడి పూజారులు కూడా ప్రతినెల జీతభత్యాలు ఇవ్వాలని విన్నపం చేశారు. బంజారా సుగాలి సంస్కృతి సాంప్రదాయాలు అందరూ పాటించేలా చూడాలని, గుడి పూజారులకు కోరారు. మతమార్పిడిలు జరిగి అనేక మంది క్రైస్తవంలో మతం మారుతున్నారు, ఎవరే కాని మతం మారకూడదు దయచేసి స్వధర్మం లోకి తిరిగి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దాడి కృష్ణ నాయక్ నారాయణగిరి మహారాజ్ పూజారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వత్ వెంకట్రావు నాయక్ బిడిఆర్ఎస్ కమిటీ రాష్ట్ర సభ్యులు వేణు గోపాల్ నాయక్, గోరామ్ సోమశంకర్ నాయక్ రమావత్ సతీష్ నాయక్ , సమరసత సేవా ఫౌండేషన్ ప్రముఖులు సుధాకర్, తిరుపాల్ నాయక్, పురుషోత్తం నాయక్, ఓంకార్ నాయక్, హరి నాయక్, చంద్ర నాయక్, భాస్కర్ నాయక్, శ్రీమతి లక్ష్మీ బాయి పాల్గొన్నారు.

## ముగిసిన దస్తగిరి స్వామి జలధి కార్యక్రమం

**కనగానపల్లి జూన్ 27 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో శనివారం దస్తగిరి స్వామి, ఓన్నూరు స్వామి, కుళాయి స్వామి లు మొహరం సందర్భంగా పీర్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. భక్తులు, గ్రామస్తులు స్వామి వారికి చక్కెర చదివింపులు చేసి మొక్కుకున్నారు. జలదికి వెళ్తున్న స్వామి వారి పీర్ల వెంట యువకులు ఉల్లాసంగా ఉత్సాహంగా అలావ్ తొక్కుతూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పీర్లను చెరువు వద్దకు జల్దీ కార్యక్రమం తీసుకువెళ్లడం తో జలధి కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు ముల్లాసాబ్ లు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జలదికి తరలి వెళ్తున్న పీర్లు

# ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు

**- తరిమెల పిహెచ్‌సి డాక్టర్ శంకర్ నాయక్**



డా.శంకర్‌నాయక్

శింగనమల, జూన్ 27 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ నేడు పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నట్లు ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తరిమెల పిహెచ్‌సి వైద్యాధికారి డా.శంకర్‌నాయక్ తెలిపారు. శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఆదివారం బూత్ స్థాయిలో 29వ తేది, 30వ తేది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, మండల వ్యాప్తంగా 43 పల్స్ పోలియో బూతులు, ఒక ట్రాన్సిట్, మొబైల్ టీం ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలానికి నిర్దేశించిన 5020 లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు తమ విధిగా గుర్తించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

# నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు



ఎస్ఐ కె.ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

శింగనమల, జూన్ 27 ప్రభాతవార్త

ఇటీవల శింగనమల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కె.ప్రసాద్‌కు శనివారం సోదనపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ సర్పంచు అట్టె రామాంజినేయులు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏకిల ఆదినారాయణ, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు దాల్ వీరనారాయణ, చిన్న చౌడప్ప, జానకొండ శ్రీనివాసులు, తిరుపాల్, ఏకిల లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

# రుషి స్పంగమహాముని జ్ఞాపకార్థం అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

శింగనమల, జూన్ 27 ప్రభాతవార్త

మండల పరిధిలోని శింగనమల క్రాస్ వద్ద శనివారం రుషి స్పంగమహాముని జ్ఞాపకార్థం, గంపమల్లయ్య, శ్రీరంగరాయల వారి జ్ఞాపకార్థంగా 52వ శనివారం బండమీద పల్లి గ్రామానికి చెందిన ఉప్పర నీరు గంటి హరి ప్రసాద్ భార్య ఉప్పర రమాదేవి, శింగనమల మండల కేంద్రానికి చెందిన టీచర్ కృష్ణారెడ్డి భార్య రుక్మిణమ్మల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు రామ్ చరణ్ యాదవ్ తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో మండల పరిధిలోని స్వామివారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలను కలిపి పోస్టులు తగ్గించడం అన్యాయం

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 ప్రభాతవార్త

అనంతపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్త ఊరులోని ఇంగ్లీష్ మీడియం, ఉర్దూ మీడియం వేర్వేరుగా నిర్వహించబడుతున్నప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న టీచర్స్ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో రెండు మీడియాల విద్యార్థుల సంఖ్యను కలిపి పరిగణించడం వల్ల ఇంగ్లీష్ మీడియంలో ఆరు ఉపాధ్యాయ పోస్టులు తగ్గే పరిస్థితి ఏర్పడిందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఇంగ్లీష్ మీడియం, ఉర్దూ మీడియంను వేర్వేరుగా పరిగణించి, ప్రతి మీడయానికి అవసరమైన ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేకంగా కేటాయించాలని, ప్రతిపాదించిన పోస్టుల కోతను వెంటనే ఉపసంహరించుకోవాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య, జిల్లా, రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

# ఘనంగా శని త్రయోదశి పూజా



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం, జూన్ 27 ప్రభాతవార్త బ్యూరో

స్థానిక శ్రీనివాస్ నగర్‌లో గల సీతారామ ఇంజనీ దేవస్థానంలో శనివారం శని త్రయోదశి పునఃస్కరించుకొని ఆలయంలో ఉదయం 5:00 గంటలకు సుప్రభాత సేవ మొదలుకొని 8:00 గంటలకు శనీశ్వర స్వామికి తైలాభిషేకం, పంచభూతాభిషేకం, పుష్పార్చన, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రామ మాట్లాడుతూ..భక్తుల స్వహస్తాలతో తైలాభిషేకం పుష్పార్చన అనంతరం 9 నువ్వుల నూనెతో నూనెతో దీపాలు భక్తులందరూ వెలిగించిన అనంతరం భక్తులందరూ తీర్థప్రసాదాలు వినియోగ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామ్మూర్తి, మహేంద్ర, అనిల్, ప్రసాద్, శివ, భరత్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడు అనుమానాస్పద మృతి

తాడిపత్రిఅర్బన్, జూన్ 27 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీ ఆర్టీసి బస్టాండ్ వెనుక పక్కన ఉన్న మసీదు వద్ద శంకర్ నారాయణరెడ్డి ( 70) అనే వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెందారు. శరీరంపై అక్కడక్కడ వాపులు, గాయాలు అయి తన ఇంటిలో శంకర్‌నారాయణరెడ్డి అనుమానాస్పదంగా మరణించడంతో కూతురు అంకిరెడ్డి నవిత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతుడు శంకర్‌నారాయణరెడ్డి మరణానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దయాకర్ పేర్కొన్నారు.

# 30న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో భారీ ఉద్యోగ మేళా




శ్రీ చైతన్య పాఠశాల

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 ప్రభాతవార్త

నగరంలో గుత్తి రోడ్డులోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల-ప్రముఖ యునిక్‌ఫిన్ బిజినెస్ స్కూల్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ నెల 30వ తేదీన (మంగళవారం) కళాశాల ప్రాంగణంలో ఉద్యోగ మేళా (జాబ్ మేళా) నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్లు రాంకుమార్, సత్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలైన అజైల్ ప్రైవేట్ లిమిటెడ్, ఓరుగంటి అసోసియేట్స్, ఎస్‌కెవిజి అసోసియేట్స్, కెఎస్‌జి సుబ్రహ్మణ్యం అండ్ అసోసియేట్స్, మాకోనిస్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్, మైత్రేయ వంటి ప్రముఖ కార్పొరేట్ సంస్థలు పాల్గొని అభ్యర్థులను నేరుగా (డైరెక్ట్ ఇంటర్వ్యూ) ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఫైనాన్స్, అకౌంటింగ్, ఐటీ రంగాలలో.. క్రిప్టో, ఫియట్ అకౌంటింగ్ క్రిప్టో టాక్స్ రికన్సిలియేషన్ సర్వీసెస్, మ్యూ చువల్ ఫండ్స్ అకౌంటింగ్, పవర్ బిఐ, ఎస్క్యూఎల్, డేటా విజువలైజేషన్ ఎపిఐ ఇంటిగ్రేషన్స్, రికన్సిలియేషన్ ఎగ్జిక్యూటివ్, యుపిఐ, క్యాష్, క్రెడిట్ కార్డ్ రికన్సిలియేషన్‌చ టిడిఎస్, జిఎస్‌టి, ఆర్‌ఓసి కాంప్లయన్స్, ఎండ్ టు ఎండ్ అకౌంటింగ్, టాలీ ఆపరేషన్స్ బికాం, బిబిఎ, ఎంబిఎ, బిటెక్ ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అటు ఫ్రెషర్స్, ఇటు అనుభవం వున్నవారు ఎవరైనా జిల్లా పరిసర ప్రాంతా ల్లోని అర్హులైన నిరుద్యోగ యువతీ యువ కులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని డైరెక్టర్లు ఎం.రాంకుమార్, సత్యనారా యణలు కోరారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 70135 56776లో సంప్రదించాలని వారు కోరారు.

# బిఎల్ఎలకు సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న దేగల కృష్ణమూర్తి



మండల పరిధిలోని బిఎల్ఎలతో ముంటిమడుగు కేశవరెడ్డి

శింగనమల, జూన్ 27 ప్రభాతవార్త

నియోజకవర్గ పరిధిలోని గార్లదిన్నె మండలంలోని బిఎల్ఏలకు సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏడి సిసి బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గార్లదిన్నె టీడీపీ మండల కన్వీనర్ పాండు, సర్ నియోజకవర్గ పరిశీలకులు దేగల కృష్ణమూర్తి, సౌత్ డిస్ట్రిబ్యూట్ చైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, మాజీ జడ్పిటిసి గుర్రం ఆదినారాయణ, నియోజకవర్గ ఫ్లోర్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి

**- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ రమేష్‌రరెడ్డి**

**- చిటుక వ్యాధి రోగనిరోదక టీకాల కార్యక్రమం ఆకస్మిక తనిఖీ**



చిటుక వ్యాధి రోగనిరోదక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు.

పామిడి, జూన్ 27 ప్రభాతవార్త

గొర్రెల కాపరులు తమ గొర్రెలకు (జీవాలకు) వ్యాధి నిరోదక టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రేమ్ చంద్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పశువైద్యాధికారిణి డాక్టర్ ఉషాకిరణ్ ఆద్వర్యంలో శనివారం మండలంలో గొర్రెలకు జరుగుతున్న చిటుక వ్యాధి రోగనిరోదక టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రేమ్‌చంద్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిటుక వ్యాధి అనేది గొర్రెలు, మేకలలో అత్యంత ప్రమాదకమైన బ్యాక్టీరియా వ్యాధి అన్నారు. టీకాలను ఉదయం 8 గంటలలోపు సాయంత్రం 5 గంటల తరువాత ఎండ తీవ్రత తక్కువగా ఉన్నటువంటి సమయాల్లో వేయాలని, టీకాలు పాడవకుండా ఒక నిర్దిష్టమైన తక్కువ ఉష్ణోగ్రతలో భద్రపరచాలని పశుసంవర్ధక సిబ్బందిని ఆదేశించారు. జబ్బుల నివారణ, యాజమాన్య పద్దతులపై గొర్రెల కాపరులకు అవగాహణ కల్పించారు. డాక్టర్ ఉషాకిరణ్ మాట్లాడుతూ గొర్రెలు, మేకల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని గొర్రెల కాపరులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోదక టీకాలు వేయటం జరుగుతుందని జీవాలు ఆనారోగ్యానికి గురైన వెంటనే మాకు సమాచారం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో పశుసంవర్ధక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్వే సమగ్రంగా ఉండాలి.. ప్రక్షాళన పద్ధతిగా.. ప్రశాంతంగా..జరగాలి

**- యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీనేతలు**



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 ప్రభాతవార్త

సర్వే సమగ్రంగా ఉండాలి.. ప్రక్షాళన పద్ధతిగా.. ప్రశాంతంగా..జరగాలి అంతే తప్ప జనంలో భయాందోళనలు సృష్టించకూడదు అని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీనేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు తెలియజేస్తూ.. భారతదేశంలో భారత ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజ్యాంగ విరుద్ధంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ లోప భూయిష్టంగా ఉంది. ఇటీవల మొదటి, రెండవ దశ ఎన్నికల అనంతరం భారతదేశం వ్యాప్తంగా 6 కోట్ల 50 లక్షల ఓట్లు ఓటర్ల లిస్టు నుంచి తొలగించబడినట్లు పత్రికల ద్వారా, సోషల్ మీడియా ద్వారా కథనాలు వచ్చినట్లు గుర్తు చేశారు. ఓటు హక్కు అనేది పౌరులకు భారత రాజ్యాంగం ప్రసాదించిన అత్యున్నత ప్రాథమిక హక్కు. కావున జిల్లా కలెక్టర్ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో మరొక మారు సమావేశాన్ని ఏర్పాటు చేసి పారదర్శకంగా, సరళమైన, అందరికీ ఆమోదయోగ్యమైన, విధానాన్ని తక్షణమే అమలు చేయాలి. ఓటర్ల ప్రక్రియను నిష్పక్షపాతంగా, రాజకీయాలకతీతంగా చేపట్టవలసిందిగా హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నట్లు యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీనేత సి.జాఫర్ కన్వీనర్ పేర్కొన్నారు.

# పంచాయితీ రాజ్ డీఈగా పాండురంగారెడ్డి పదోన్నతి



డీఈ పాండురంగారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం



డిఈ లక్ష్మినారాయణను సన్మానిస్తున్న కాంట్రాక్టర్లు

శింగనమల, జూన్ 27 ప్రభాతవార్త

పంచాయితీ రాజ్ శాఖలో పదోన్నతి పొందిన డిఈ పాండురంగారెడ్డిని, లక్ష్మినారాయణను శనివారం జిల్లా కేంద్రంలోని పంచాయితీ రాజ్ కార్యాలయంలో శాలిని కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఒకులా కన్‌స్ట్రక్షన్, కెపిఆర్ కన్‌స్ట్రక్షన్, ఆలం వెంకట నరసనాయుడు, కెపి రంగారెడ్డి, చితంబం దొరలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకేలను అందించి భవిష్యత్తులోమరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని పేర్కొన్నారు.

# .ప్రజల పక్షాన పోరాడితే దాడులు చేస్తారా..

**- జెసి ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తీసుకోరా - వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ విమర్శ**



అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర నేతలు

అనంతపురం సిటీ, జూన్ 27 ప్రభాతవార్త

ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీగా వైసిపి పోరాడుతుంటే, టిడిపి నేతలు దాడులు చేయడం అక్రమ కేసులు బనాయించడం చేస్తున్నారని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ మండి పడ్డారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అమరావతిలో రైతు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, వైసిపి నేతలపై టీడీపీ మూకల దాడులను నిరసిస్తూ వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అమరావతి ప్రాంతంలో అక్రమంగా రైతుల భూములను రాజధాని పేరిట లాక్కుంటున్నారని, రైతులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారన్నారు. రాజధానికి భూములు ఇవ్వని రైతుల పొలాలకు నీటిని మళ్లించి భూములను సాగుకు యోగ్యం కాని రీతిలో మార్చే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఆయా భూములను పరిశీలించేందుకు వెళ్తున్న వైసిపి నేతలపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరగడం సిగ్గు చేటు అన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపేసి రాయలసీమ ప్రాంత భూములకు సాగునీరు అందకుండా ఎడారి చేశారన్నారు. మరోవైపు తన ఆర్థిక ప్రయోజనాల కోసం అమరావతిలో రాజధాని నిర్మాణం పేరిట పేదల భూము లను కొల్లగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే దాడులకు పాల్పడటం, అక్రమ కేసులు పెట్టడం చేస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కేప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి శ్రేణులపై దాడులు జరుగుతుంటే హోం మంత్రి అనితకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా తాడిపత్రిలో ప్రజా స్వామ్య పరిరక్షణకు వైసిపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తే నాపై అక్రమ కేసులు బనాయించారన్నారు. అయితే తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్ వద్దే స్నానం చేసి నిరసన వ్యక్తం చేస్తే కనీసం కేసులు కూడా పెట్టలేక పోయారని ఆయన విమర్శించారు. అంతేకాకుండా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని వయస్సుకు కూడా గౌరవం ఇవ్వకుండా అసభ్య పదజాలంతో దూషిస్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. అయితే రానున్న రోజుల్లో వీటికి మూల్యంచెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యువజన విభాగం నేతలు దాదాఖలందర్, మణికంట, వినీత్, రమేష్, ఉదయ్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

# సర్‌పై హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు - జడ్పి సిఇఓ విజయలక్ష్మి



జడ్పి సిఇఓ విజయలక్ష్మి

అనంతపురం సిటీ, జూన్ 27 ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల కమిషన్ అత్యంత ప్రాధాన్యతగా భావిస్తున్న సర్‌పై హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జడ్పి సిఇఒ విజయలక్ష్మి పేర్కొన్నారు. సర్‌పై సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా పరిషత్‌తోపాటు అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సర్‌ను వంద శాతం విజయవంతం చేయాలని ఆమె సూచించారు. ఒక్కో హెల్ప్ డెస్క్‌లో డిప్యూటీ ఎంపిడిఓ, జూనియర్ అసిస్టెంట్ అందుబాటులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి




ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 ప్రభాతవార్త

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ వారోత్సవాలలో భాగంగా నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం శనివారం కళాశాల చైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆధ్వర్యంలో యస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో విద్యార్థులకు దుష్పరిణామాలు, నివారణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.టి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక పరమైన తీవ్ర దుష్పరిణామాలు కలుగుతాయని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించి మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.పి.ఓలు జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని ప్రతిజ్ఞ చేశారు.

# శాస్త్ర విజ్ఞానంతోనే సమాజ అభివృద్ధి

**- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్**




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డా.ఎం.గేయానంద్

అనంతపురం, జూన్ 27 ప్రభాతవార్త బ్యూరో

శాస్త్ర విజ్ఞానాన్ని సమాజంతో మిళితం చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్, విన్సెంట్ డిపాల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జరిగిన సభ్యత్వ క్యాంపెయిన్‌లో పాల్గొని మాట్లాడారు. శాస్త్ర విజ్ఞానం ఎప్పుడు ప్రశ్నతోనే మొదలవుతుందని అన్నారు. ఆ ప్రశ్నకు దొరికిన సమాధానం ప్రయోగాత్మకంగా నిరూపించబడాలని అప్పుడే అది సరైన ఫలితాన్ని ఇవ్వగలుగుతుందని తెలియజేశారు. ఇవన్నీ కూడా శాస్త్రీయంగా ఆలోచించినప్పుడే సాధ్యమవుతాయని అందుకు ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నెల రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ క్యాంపెయిన్ జరుగుతుందని అందులో భాగంగానే మన జిల్లా అంతట సభ్య త్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ తెలియజేశారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు 20 రూపా యల రుసుముతో జెవివి సభ్యత్వం తీసుకోవచ్చని కావున ఎక్కువ మంది చేరాలని ఆయన ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం మొదటి సభ్యత్వ రసీదును రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ కరస్పాండెంట్ ఎం.శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు వి.జయచంద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, బయన్న తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకుల పాఠశాలలుక్రకాశాలలకు సరుకుల పంపిణీకి టెండర్ల ఆహ్వానం



టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 ప్రభాతవార్త

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహణలో ఉన్న 6 ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలు/కళాశాలలకు అవసరమైన వంటసరుకులు, కూరగాయలు, పాలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్ సరఫరా కొరకు టెండర్లను శనివారం రెవిన్యూ భవన్‌లో నిర్వహించారు. ఈ టెండర్ ప్రక్రియలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, కన్వీనర్ ప్రిన్సిపల్, జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు/కళాశాలల ప్రిన్సిపాల్స్, టెండర్ దారులు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర రవీంద్ర, రామాంజినేయులు, రఫీ తదితరులు పాల్గొన్నారు. టెండర్ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో నిర్వహించారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలనే లక్ష్యంతో పోటీ పద్ధతిలో టెండర్లను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని సకాలంలో అందించేందుకు సరఫరాదారులు నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత మరియు ఒప్పంద నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# 29న శివసాయిమందిరంలో సత్యనారాయణస్వామి వ్రతం



షిరిడిసాయి బాబా

తాడిపత్రిఅర్బన్, జూన్ 27 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని సంజీవనగర్ 5వ రోడ్డులో వెలసిన శివసాయిమందిరంలో ఈ నెల 29వతేదీ సోమవారం ఉదయం 10 గంటలకు సత్యనారాయ ణ స్వామి వ్రతాన్ని నిర్వహించ నున్నట్లు ఆలయ అర్చకులు మారుతిప్రసాద్‌శర్మ తెలిపారు. పౌర్ణమి సందర్భంగా రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించడం జరుగుతుందన్నారు. కావునా భక్తులు ఈ వ్రతంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి సత్యనారాయణస్వామి కృపకు పాత్రులు కావాలన్నారు. వ్రతంలో పాల్గొనదలచిన వారు 798194 2160కు సంప్ర దించాల ని అర్చకులు తెలిపారు.

**CHANGE OF SURNAME**

I, **PEETALA GANGAMMA** (Old Surname) W/o PEETLA NATARAJU R/o Indiramma Colony, Valmiki Kalyanamandapam backside, Settur road, Kalyandurg, Ananthapuramu(D)-515761, AP. I have changed my New Surname as **PEETLA GANGAMMA**, here after my NewSurname is known as **PEETLA GANGAMMA** W/o PEETLA NATARAJU.

**CHANGE OF SURNAME**

I, **PEETALA YASODHA NANDU** S/o PEETALA NATARAJU (Old Surname) R/o Indiramma Colony, Valmiki Kalyanamandapam backside, Settur road, Kalyandurg, Ananthapuramu(D)-515761, AP. I have changed my New Surname as PEETLA YASODHA NANDU, here after my new Surname is known as **PEETLA YASODHA NANDU** S/o PEETLA NATARAJU (NEW Surname).

**CHANGE OF SURNAME**

I, **PEETALA NATARAJU** (Old Surname) S/o PEETLA VENKATESULU R/o Indiramma Colony, Valmiki Kalyanamandapam backside, Settur road, Kalyandurg, Ananthapuramu(D)-515761, AP. I have changed my New Surname as **PEETLA NATARAJU**, here after my NewSurname is known as **PEETLA NATARAJU**

04ATP27.qxd:04ATP27.qxd 28/06/26 10:51 PM Page 1



# సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, జూన్ 27 ప్రభాతవార్త బ్యూరో

పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు తన క్యాంపు కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదలను ఆర్థికంగా కొంతైనా ఆదుకోవాలని ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లబ్ధిదారులుకు ఆర్థిక భరోసా కల్పించాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు ప్రజల సమస్యలను తెలుసుకొని వైద్యానికి అయినటువంటి ఖర్చులను కొంతైనా ఆర్థిక వేసులుబాటు కల్పించాలని ప్రతిపాదనలో పంపించి చెక్కుల రూపంలో ఈరోజు లబ్ధిదారులకు నేరుగా అందించడంతో ఎంతో ఆనందంగా అనంతపురం ఎంపీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఎప్పటికీ రుణపడి ఉంటామని తమ కృతజ్ఞతలు కుటుంబ సభ్యులతో కలిసి తెలియజేశారు. లబ్ధిదారులకు చెక్కులు అందించడంలో జిల్లాలోని వివిధ గ్రామాలు, పట్టణాల్లో లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రామాంజనేయులు రూ.1,11,300, ధనుంజయ రూ.35,500, విజయ్ కుమార్ రూ. 40,393, నరసింహప్ప రూ.85,000, శ్రీనివాస రావు రూ.1,28,430, రత్నమ్మ రూ.56,660, తిరుపతినాయుడు రూ. 50,000, సురేష్ రూ.1,09,507, రంగనాథ చౌదరి రూ.1,41,376, రాధాకృష్ణ రూ.38795, భాగ్యలక్ష్మి (ఆనంద్) రూ.80,090 చెక్కులను అంజదేశారు.



ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అందజేసిన చెక్కులను చూపుతున్న లబ్దిదారులు

# ఇంటి నుంచే దివ్యాంగులకు ప్రోత్సాహం మొదలు కావాలి

## - మీరు ధైర్యంగా అడుగు వేస్తే.. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్న సునీత

రామగిరి, జూన్ 27 ప్రభాతవార్త

దివ్యాంగులను ప్రోత్సహించడం ఇంట్లో కుటుంబసభ్యుల నుంచి ప్రారంభం కావాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ శాఖ అతిథి గృహంలో దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, సహాయక పరికరాలను ఉచితంగా అందజేశారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన 64 మంది దివ్యాంగులకు 2025-26 సంవత్సరానికిగాను రూ.20లక్షలు విలువ చేసే పరికరాల్ని అందజేశారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ అలింకోవారు, సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందించారు. పెద్ద, మధ్యస్థ సైజు వీల్‌చైర్లు, వాకర్స్, ట్రైసైకిల్స్, 7 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు టీఎంఎల్‌ఎం కిట్స్, కమోడ్ సౌకర్యంతో కూడిన సీపీ వీల్‌చైర్లు, బీటీఈ డిజిటల్ వినికిడి పరికరాలు, పెద్దల కోసం రోలేటర్లు, బ్రెయిలీ కిట్లు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. మేనరికపు వివాహాలు, జన్యులోపాల కారణంగా దివ్యాంగులుగా జన్మిస్తుంటారన్నారు. ఇలాంటి పిల్లలను ధైర్యంగా ముందుకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులకు చేతులెత్తి నమస్కరించాలన్నారు. ఇప్పటికి చాలా మంది దివ్యాంగులు ఇంటిలోనే పని చేస్తూ స్వియఆర్జన చేస్తున్నారని.. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మేనరికపు వివాహాల గురించి కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా దివ్యాంగులను ప్రోత్సహిస్తోందన్నారు. గతంలో మూడు వేలు ఉన్న పింఛన్ ను 6వేలు చేసిందని.. పూర్తి స్థాయిలో మంచానికి పరిమితమైన వారికి 15వేలు ఇస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగ శక్తి ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారని.. వారి సహాయకులకు 50శాతం రాయితీ ఇస్తున్నారన్నారు. ఇప్పుడు ఇంత ఖరీదైన పరికరాలను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

# అమరావతిలో వైసిపి నేతలపై దాడులు అప్రజాస్వామికం

## - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శ

అనంతపురం సిటీ, జూన్ 27 ప్రభాతవార్త

రాజధాని అమరావతిలో రైతులు, రైతు పరిరక్షణ కమిటీ నేతలు వైసిపి ప్రతినిధి బృందంపై దాడులు అప్రజాస్వామికమని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలోని రైతులు వైసిపి అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యను తెలియజేసిన్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతు పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి రైతుల ఆహ్వానం మేరకు పొలాలను పరిశీలించేందుకు వెళ్లిన నేతలపై టీడీపీ బృందాలు రాళ్లు, కర్రలతో దాడులు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. పోలీసుల సమక్షంలోనే దాడులు చేయడం దుర్మార్గ కరమని మండి పడ్డారు. అమరావతిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు బాహ్యాప్రపంచానికి తెలియజకుండా చేడయమే లక్ష్యంగా టీడీపీ మూఖలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, మంత్రి నారా లోకేస్ డైరెక్షన్‌లోనే దాడులు జరిగాయని ఆయన విమర్శించారు. రాజధాని ప్రాంతంలో అన్యాయానికి గురవుతన్న రైతులకు వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ అండగా ఉం టుందని ఆయన స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

# సర్‌పై ఎమ్మెల్యే పరిటాల సునీత సమీక్ష

రామగిరి, జూన్ 27 ప్రభాతవార్త

మండల కేంద్రమైన రామగిరిలో పంచాయతీరాజ్ అతిథిగృహంలో మండల నాయకులు, బీఎల్‌ఎలతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ..బీఎల్‌ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు ఓటరు ధృవీకరణ విదానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై తెలియజేసి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి 2025 ఏళ్ల ఒకసారి సర్ కార్యక్రమం జరుగుతు ందని, 2002 ఓటరు జాబితాను పరిగణలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతున్నట్టు తెలిపారు. జూలై 14 లోపు రెండు సార్లు ఓటర్ల మ్యాపింగ్ చేస్తారని జూలై 15 నుంచి ఆగస్టు నెలాఖరువరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. సర్ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని సూచించారు.



సర్‌పై మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాలసునీత

# రైల్వే వంతెనలు, అండర్ బ్రిడ్జిల పనులను వేగవంతం పూర్తి చేయాలి

## ..జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి (కలెక్టరేట్) జూన్ 27 , ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లాలో కొనసాగుతున్న, ప్రతిపాదిత దశలో ఉన్న రైల్వే వంతెనలు అండర్ బ్రిడ్జిల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జె సి మోర్య భరద్వాజ్ లు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు వివిధ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లు అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతి, పెండింగ్ అంశాలు, శాఖల మధ్య సమన్వయం తదితర విషయాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజల సౌకర్యం, భద్రత దృష్ట్యా పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశానికి రైల్వే శాఖ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ , మరియు జాతీయ రహదారుల సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్, జె సి లు

# తహశీల్దార్లు ప్రతి ఫారమును క్షుణ్ణంగా పరిశీలించాలి

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బిఎల్ఓ ల పాత్ర కీలకం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి , జూన్ 27, ప్రభాతవార్త

మండల తాసిల్దార్లు తప్పనిసరిగా ఫారములను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో బి ఎల్ ఓ పాత్ర కీలకమని, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అధికారులందరినీ ఆదేశించారు. శ్రీ సత్య సాయి జిల్లా కలెక్ట రేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో శనివారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ2026 పై మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపిడిఓలతో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మరియు జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి అందిన నివేదికల ప్రకారం జిల్లాలో ఓటర్ల ఫారాల పంపిణీ ప్రక్రియ 93.07 శాతంతో విజయవంతంగా కొనసాగుతోందన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బిఎల్వోల పాత్ర కీలకమని, వివిధ ఫారంలకు సంబంధించి పూర్తి అవగాహన ఉండాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. జూలై 14 తేదీ లోపల ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్ఓ కొండయ్య,మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇ.ఆర్.ఓలు మరియు ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

# రెండవ వారం కొనసాగిన 7 శనివారాల వ్రతం

తాడిపత్రిఅర్బన్, జూన్ 27 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని పురాతన శ్రీచింతల వేంకటరమణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 7 శనివారాల వ్రతం రెండవ శనివారం కొనసాగింది. ఇందులో భాగంగా అర్చకులు మురళీకృష్ణ హాజరైన భక్తుల చేత 7 శనివారాల వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో చేయించారు. ముందుగా ఆలయంలో చింతలరాయునికి, ఆనందవల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దరి ్శంచుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తి శ్రద్ధలతో 7 శనివారాల వ్రతం ఆచరిస్తే అభీష్టం నెరవేరుతుందని భక్తుల నమ్మకం.



# గతే డాదితో పోలిస్తే ప్రమాదాలు, మరణాలు తగ్గుముఖం

## - జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి, జూన్ 27, ప్రభాతవార్త

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రమాదాలు 30 శాతం, మరణాలు 32 శాతం తగ్గు ముఖం పట్టినట్లు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ లు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు శ్రీ సత్యసాయి జిల్లాలో రహదారి భద్రతను మరింత బలోపేతం చేయడం, ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం వివిధ శాఖల అధికారులతో జరిగింది.

ఈ సందర్భంగా జిల్లాలో ప్రమాదాల నివారణకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, భవిష్యత్తులో చేపట్టా ల్సిన అత్యవసర పనులపై శాఖల వారీగా సమగ్రంగా చర్చించారు. హారిపు రం జంక్షన్, పుట్టపర్తి క్రాస్, దామాజీపల్లి, దుద్దెబండ క్రాస్ సహా జిల్లా పరిధిలోని మొత్తం 26 ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అక్కడ రంబుల్ స్ట్రిప్స్, సోలార్ లైట్లు, రిఫ్లెక్టివ్ స్టడ్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ రహదారిపై ప్రయాణానికి ఆటంకంగా మారిన గుంతలను, దెబ్బతిన్న రహదారి భాగాల మరమ్మతు పనులను పూర్తి చేసినట్లు వెల్లడించారు. రహదారి భద్రతపై జిల్లా కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. చారిత్రక ప్రాంతమైన లేపాక్షి నుంచి జాతీయ రహదారిపైకి నేరుగా వాహనాలు ప్రవేశించి ప్రమాదాలు జరగకుండా, లింక్ రోడ్ల వద్ద అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల మధ్యలో ఏర్పాటు చేసిన విగ్రహాలు లేదా ఇతర నిర్మాణాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా, ప్రమాదాలకు కారణం కాకుండా ఉండేలా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమన్వయం, నిరంతర నిఘా కారణంగా జిల్లాలో రహదారి ప్రమాదాల రేటు గణనీయంగా తగ్గిందని సమావేశంలో వెల్లడించరు. 2025 జనవరి మే కాలంతో పోలిస్తే, 2026 జనవరి మే నాటికి ప్రమాదాలు మరియు మరణాల సంఖ్య భారీగా తగ్గింది. ఈ సమీక్షా సమావేశంలో ఆర్టీఓ కరుణ సాగర్, పోలీసు, రవాణా , జాతీయ రహదారుల సంస్థ, రహదారులు భవనాలు, పంచాయతీరాజ్, ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్, వైద్య, విద్యాశాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్‌లు



హాజరైన సంబంధిత శాఖల అధికారులు

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

## - పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి - అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్‌కుమార్

గుత్తి, జూన్ 27 ప్రభాతవార్త

నేటి సమాజంలో విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, జెఎన్‌టియు ప్రొఫెసర్ ప్రశాంతిలు పేర్కొన్నారు. గుత్తి శివారు ప్రాంతంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రెండవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణిస్తూనే యువతకు ఉపాధి కల్పించే దిశగా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఎంబీఏ ఎంసీఏ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. ప్రజలు కనపరిచిన ఎంబీఏ విద్యార్థి షేక్‌అబ్బాస్, ఎంసీఏ విద్యార్థి రేష్మా తబుస్సంలకు అతిథులతో పాటు యాజమాన్యం ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాలలో గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రఘునాథరెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతి, డైరెక్టర్ వికె వాణి, ప్రిన్సిపల్ డాక్టర్ నమ్రత, ఏఓ ఇంతియాజ్‌బాష, పిఆర్ఓ నాసిర్, హెచ్ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేస్తున్న దృశ్యం

# ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలి

## - పీజీఆర్ఎస్‌లో అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే

గుంతకల్లు, జూన్ 27 ప్రభాతవార్త

ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్వీకరించిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపి ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. పారదర్శకమైన, అవినీతి రహిత పాలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు కొంత ఆలస్యమైనా, తాగునీరు, విద్యుత్,రెవెన్యూ, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన మైనార్టీ సంక్షేమ కళాశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, డిప్యూటీ తహవీల్దార్ నారాయణస్వామి, డిప్యూటీ ఎంపిడిఓ జయప్రద, మెప్మా అధికారిని భువన, పార్టీ పట్టణ అధ్యక్షులు గుణశేఖర్, మండల కన్వీనర్ రామన్న చౌదరి, నాయకులు తలారి మస్తానప్ప, ఫజులు, మాజీ కౌన్సిలర్లు ఉడుదాల ప్రభాకర్, అంజి, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

# అక్రమ రిజిస్ట్రేషన్ లపై చట్టరీత్యా చర్యలు తప్పవు - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ జూన్ 27 ప ప్రభాతవార్త

ఆస్తుల రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగినట్లు రుజువైతే చట్టరీత్యా చర్యలు తీసుకొని వాటిని రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సెక్షన్ 77 ఏ కింద ఇదివరకే జరిగిన కొన్ని రిజిస్ట్రేషన్ల కేసుల గురించి జిల్లా జిల్లాస్థాయి కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ రిజిస్ట్రేషన్లు అక్రమంగా జరిగినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వ నియమ నిబంధన మేరకు పరిశీలించి రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విధి నిర్వహణలో భాగంగా ఆయా రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని అధికారుల వ్యవహరించిన తీరువల్ల క్రయ, విక్రయదారులకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాస్ కుమార్ ఆర్డీఓలు రామ్మోహన్, ఆర్బిఎస్కె శ్రీనివాస్, వసంతబాబు, కమిటీ కన్వీనర్ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారి శ్రీనివాసులు, కనేకల్ సబ్ రిజిస్టర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

# 4పంచాయతీల్లో తాగునీరు, డ్రైనేజీల సమస్య లేకుండా చూడండి

## ఆర్.డబ్ల్యూ.ఎస్, సివిల్ సప్లైస్, ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం.

అనంతపురం రూరల్, జూన్ 27 ప్రభాతవార్త

రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. తన క్యాంప్ కార్యా లయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహి ంచారు. ముందుగా ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. నాలుగు పంచాయతీల్లో ఉన్న సమస్యల గురించి చర్చించారు. ప్రస్తుతం తాగునీరు ఎంత మేర సరఫరా అవుతోంది.. ఎక్కడైనా సమస్య ఉందా అని ఆరా తీశారు. అలాగే డ్రైనేజీ సమస్యల గురించి ఆరా తీశారు. త్వరితగతిన చేపట్టాల్సిన వాటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే తాగునీటి సమస్య ఎక్కడా లేకుండా చూసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులు పురోగతికూడాచర్చించారు. ఆ పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో మేనేజర్, డీఈలతో సమావేశం నిర్వహించారు. అనంతపురం డిపోకు కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులు వచ్చిన నేపథ్యంలో వాటిని ఎక్కడవిని యోగించాలన్నది చర్చించారు. అనంతపురం డిపోకి కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను ఇక్కడే వినియోగించాలని ప్రయాణికుల అవసరం కూడా ఎక్కువగా ఉందన్నారు. వీటితో పాటు పాత బస్సులను కూడా ఎక్కడిక్కడే ఉండేలా వేరే డిపోలకు పంపించకుండా యధావిధంగా ఉంచాలని ఆదేశించారు. స్త్రీ శక్తి పథకం అమలవుతున్న నేపథ్యంలో కొత్త బస్సుల అవసరం ఎక్కువగా ఉందన్నారు. జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి.. బస్సులను అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక స్టాండ్ ఏర్పాటు గురించి కూడా చర్చించారు. మరోవైపు పౌర సరఫరాల శాఖ అధికారులతో కూడా ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగు తున్న రేషన్ పంపిణీ గురించి చర్చించారు. 60ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరఫరా చేయాలన్నారు. దీని పై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రేషన్ బియ్యం తూకాలు కూడా కచ్చితంగా ఉండాలనిఎవరైనా బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# ఉద్యోగుల శ్రేయస్సే ధ్యేయం

అనంతపురం న్యూటౌన్, జూన్ 27 ప్రభాతవార్త

ఉద్యోగుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తామని చైర్మన్ వడ్డే వెంకట్, కార్యదర్శి శివప్రసాద్‌లు పేర్కొన్నారు. శనివారం అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రగతి పథం ఆధ్వర్యంలో వారిని కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు శుభాకాంక్షలు తెలియజేయడంతో వారు పై విధంగా స్పంది ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఎల్లప్పు డు అందుబాటులో ఉండి వారి బాగుకోసం పని చేస్తామని పేర్కొన్నారు. అనం తరం సంఘం నేతలు మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయ సంస్థకు దాదాపు రెండు కోట్ల రూపాయల నిధులు రాబట్టి, ఉద్యోగుల రెండు నెలల బకాయి జీతాలు, మూడు నెలల పెన్షన్లు చెల్లించేందుకు ప్రత్యేక కృషి చేసి, ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల కష్టాలను తీర్చినందుకు కి మా సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు, శతకోటి కృతజ్ఞతలు తెలియజే స్తున్నామన్నారు. అలాగే వీరిద్దరి సమర్థవంతమైన సారథ్యంలో అనంతపురం జిల్లా గ్రంథా లయ సంస్థ సరికొత్త పుంతలు తొక్కాలని ఆశిస్తున్నామన్నారు. అలాగే, జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కు గ్రంథాలయాల ద్వారా మంచి భవిష్యత్తు (ఉద్యోగ అవకాశాలు) లభిం చేలా వారు మరిన్ని కార్యక్ర మాలు చేపడుతూ, వారి బాగు కోసం పాటుపడతారని నమ్ము తూ.. ఇరువురికి మా ఉద్యోగ సంఘాల తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



: చైర్మన్ వడ్డే వెంకట్, కార్యదర్శి శివప్రసాద్ సన్మానిస్తున్న ఉద్యోగులు